
డెంగీతో జాగ్రత్త సుమా..!



2



2

ఇసుక లారీ సీజ్

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

## ఎలక్ట్రిక్ కారులో ఎమ్మెల్యే ధన్‌పాల్



అక్షరటుడే, ఇందూరు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలనే ఉద్దేశంతో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదివారం ఈవీ (ఎలెక్ట్రిక్ వెహికల్ )లో ప్రయాణించారు. నగరంలోని పలు కార్యక్రమాలకు ఈవీ కారులోనే వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యుద్ధ వాతావరణ నేపథ్యంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పారు.



## రాజీవ్ మెమోరియల్ జ్యోతి యాత్రకు జిల్లాలో ఘనస్వాగతం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి బయలుదేరిన రాజీవ్ మెమోరియల్ జ్యోతి యాత్ర ఆదివారం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ సేవలను దేశం గర్వంగా స్మరించుకుంటోందన్నారు. 1944 ఆగస్టు 20న జన్మించిన రాజీవ్ గాంధీ 1984 నుంచి 1989 వరకు భారత దేశ 6వ ప్రధాన మంత్రిగా సేవలందించారన్నారు. ఆయన పాలనలో టెలీకమ్యూనికేషన్, సాంకేతిక విజ్ఞానం, విద్యా రంగాల్లో కీలక సంస్కరణలు చేపట్టి ఆధునిక భారత నిర్మాణానికి బలమైన పునాది వేశారన్నారు. యువత సాధికారత, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్మికుల కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్ గౌడ్, రాష్ట్ర మాజీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జగడం సుమన్, డీసీసీడి ఉపాధ్యక్షులు కౌడపు శరత్, ఏఎంసీ డైరెక్టర్ రఘు పాల్గొన్నారు.

## కిసాన్‌నగర్‌లో ఇళ్లగణనను పరిశీలించిన అధికారులు



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో కొనసాగుతున్న ఇళ్లగణనను (హౌస్ లిస్టింగ్) ప్రక్రియను ఆదివారం అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్, ఎంఈవో బట్టు రాజేశ్వర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ గణన ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి ఇల్లు, కుటుంబాల వివరాల నమోదు, మొబైల్ యాప్‌ల పనితీరు, అలాగే ఎన్యూమరేటర్లు నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలను ఆయన తనిఖీ చేశారు. ఛార్జ్ ఆఫీసర్లు తమ పరిధిలోని ఇళ్లను బ్లాక్‌లుగా సక్రమంగా విభజించారో లేదో కూడా పరిశీలించారు. జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతున్న నేపథ్యంలో, ఎన్యూమరేటర్లు మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను నమోదు చేసే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్లగణనలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి ఇంటిని కచ్చితంగా లెక్కించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గణన ప్రక్రియలో ఏవైనా సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ నగర్ సర్పంచ్ రామరాజు గౌడ్, సూపర్‌వైజర్ మాలెం సాయన్న, ఎన్యూమరేటర్లు రాజారపు కీర్తి, రమాదేవి, రాజేందర్ పాల్గొన్నారు.

**కామారెడ్డి జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఆరు నెలలుగా అక్కడక్కడ పెద్దపులి సంచరించడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. పులి తిరిగినట్టు ఆనవాళ్లు కనిపించడంతో అధికారులు దాని జాడ కోసం జల్లెడ పడుతున్నారు. ప్రత్యేకంగా ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం అడవుల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయినా పెద్దపులి ఆచూకీ లభించడం లేదు.**

- అక్షరటుడే, కామారెడ్డి

- జిల్లాలో నెల క్రితం కనిపించిన పులి
- ఆరు గ్రామాల అధికారుల గాలింపు
- ట్రాప్ కెమెరాల ఏర్పాటు

# పెద్దపులి జాడేది?



మాచారెడ్డి రేంజ్ అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపుతోంది. గత నెల 17న పులి అడుగుల జాడలు కనిపించడంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు నెల రోజులుగా జల్లెడ పడుతున్నా ఆచూకీ మాత్రం లభించడం లేదు. ట్రాప్ కెమెరాలకు కూడా చిక్కకపోవడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఇసాయిపేట, స్కూల్ తండా, గిద్ద, రామారెడ్డి, మద్దికుంట, రెడ్డిపేట అటవీ ప్రాంతాలను అధికారులు జల్లెడ పడుతున్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పగలు, రాత్రి తేడా లేకుండా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. పులి అడుగులు, విసర్జితాలు, గోర్ల గుర్తుల కోసం అణువణువూ గాలిస్తున్నారు. ఆరు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

### నెల క్రితం కనిపించిన ఆనవాళ్లు

మాచారెడ్డి రేంజ్ పరిధిలో గత నెల 17న పులి సంచరించిన ఆనవాళ్లను అటవీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క కెమెరాకు కూడా పులి కదలికలు చిక్కలేదు. దీంతో పులి వేరే ప్రాంతానికి వెళ్లిందా లేక అడవిలోనే ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా పులి ఒకసారి కనిపిస్తే దాని కదలికలు ట్రాక్ చేయడం సులభం అవుతుందని అధికారులు చెప్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం ఆనవాళ్లు కనిపించిన తర్వాత పెద్దపులి పూర్తిగా మాయమైంది. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం రంగంలోకి దిగి, కూంబింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు.

### ప్రజల్లో భయాందోళన

పులి సంచారం వార్తతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని, పశువులను మేతకు తీసుకెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సాయంత్రం 6 గంటల తర్వాత అటవీ ప్రాంతం వైపు వెళ్లొద్దని సూచించింది. ఎవరికైనా పులి కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరింది. మాచారెడ్డి రేంజ్ నుంచి పెద్దపులి నిజామాబాద్ జిల్లా వైపు వెళ్లిందా లేక మెదక్ అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిందా అనే కోణంలో అధికారులు అన్వేషిస్తున్నారు. పులి ఆచూకీ తెలిసే వరకు గాలింపు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## చెరువు కట్టలకు మరమ్మతులపై నిర్లక్ష్యం తగదు



**అక్షరటుడే, లింగంపేట:** ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన చెరువు కట్టలకు ఏడాది గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతులు చేయించలేదని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కన్నాపూర్, బల్కంపేట్, కొత్తపల్లి గ్రామాల్లో 100 ఎకరాలకు పైగా నీరందించే ప్రధాన చెరువు కట్ట వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన చెరువు కట్టలు తెగిపోయి ఏడాది గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవడం అన్యాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మరమ్మతులపై ఎందుకు స్పందించట్లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా తాము మరమ్మతులకు ప్రతిపాదనలను పంపామని.. కానీ నిధులు విడుదల కాలేదని పేర్కొన్నారు. వచ్చే వారం రోజుల్లో మరమ్మతు పనులకు సంబంధించి పనులు ప్రారంభం కాకపోతే కన్నాపూర్ గ్రామం నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దివిటీ రమేష్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్ రావు, గాండ్ల నర్సింలు, విఠల్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



**అక్షరటుడే, ఆర్మూర్/బాల్కొండ:** బాల్కొండ మండలం వన్నెల్ (బి) ఉన్నత పాఠశాల 2001 -02 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పడగల్ గురడిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత ఒకచోట చేరిన పూర్వవిద్యార్థులు ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, నర్సయ్య, ఒడ్డెన్న, రాజేశ్వర్, మహేందర్, రాంచందర్, సురేష్, పూర్వ విద్యార్థులు దేవేందర్, చిరంజీవి, సాదుల్ల, రవి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత గురువులదే..




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** చక్కటి విద్యాబుద్ధులు నేర్పించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి వారితో పాటు రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ హాజరయ్యారు. ముందుగా డీఈవో అశోక్ జిల్లాలో విద్యాశాఖ ప్రగతిని నివేదిక రూపంలో చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. సమాజంలో గురువులకు ఎంతో గౌరవం, గొప్ప స్థానం ఉందన్నారు. 2047 వరకు భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని సాకారం చేసేవిధంగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. ఏ లక్ష్య సాధనకైనా చదువు ఎంతో తోడ్పాటును అందిస్తుందని, విద్యతో కూడి ఉన్న జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్న ఫలితంగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు నమోదు చేస్తున్నాయని పేర్కొన్నారు. జామాబాద్ జిల్లాలో ప్రభుత్వ బడుల విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. అయితే విద్యార్థులు కేవలం మార్కుల సాధనకే పరిమితం కాకుండా, నాణ్యమైన విద్యను ఆర్జించాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు నర్సయ్య, కృష్ణవేణి, జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, జీఈసీవో భాగ్యలక్ష్మి, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్షకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. డీఈఐఈడీ పరీక్ష ఈనెల 25వ తేదీ నుంచి 31వరకు నగర శివారులోని మల్లారం డైట్ కళాశాలలో, ఖిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగనున్నాయన్నారు. ఈ పరీక్ష కేంద్రం వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో పోలీసు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడం నిషేధమని తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాప్‌లు, స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆయన సూచించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయబడుతుందన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం..

**అక్షరటుడే, బాన్సువాడ:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఉమ్మడి జిల్లా సమన్వయకర్త వి. గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ అభివృద్ధిని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, బీఆర్ఎస్ మాత్రమే ప్రజల కోసం పోరాడే పార్టీ అని అన్నారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకెళ్లిందని పేర్కొన్నారు. 50 మంది సభ్యులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తామని, ఇందులో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొంటారని వీజీ గౌడ్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2361 బూత్‌లు ఉండగా, సుమారు 5 వేల మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జుబేర్, అంజిరెడ్డి, నార్ల రత్నకుమార్, రాజు, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నందిపేట్ మండలంలో పలు శుభకార్యాలలో ఆదివారం పాల్గొన్నారు. బాద్గుణ గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి సోదరుడు శ్రీకాంత్ దంపతుల కుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఉమ్మెడ గ్రామానికి చెందిన గాజుల సాగర్ కుమారుల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట బాద్గుణ ఉప సర్పంచ్ శివ, ఉమ్మెడ మాజీ ఉప సర్పంచ్ గుడ్డోళ్ల సాయి రెడ్డి, భూతం సాయి రెడ్డి ఉన్నారు.


## సరస్వతి విద్యా మందిరంలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని గోల్‌బంగ్లా సరస్వతి విద్యా మందిరం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చారు. అనంతరం సేవాసంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 54 వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగిస్తున్నామన్నారు. దీనికి స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సహకరిస్తున్నారన్నారు. ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఈ పాఠశాలలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించే అవకాశం మాకు కలిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు, మేనేజ్‌మెంట్ రజనీకాంత్, భాను, అభిమన్యు, విద్యా పీఠం జిల్లా కార్యదర్శి రవినాథ్, పాఠశాల ముఖ్య సలహాదారులు కర్తన్ శ్రీనివాస్, ప్రబంధకారిని కమిటీ అధ్యక్షుడు వంశీకృష్ణ, కార్యదర్శి ప్రసన్న గౌడ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిశాంత్, గుర్రం రాకేష్, ఉత్తూరు రాజయ్య, శ్యాం సుందర్, మధుసూదన్, రాహుల్ రాజ్, యాదగిరి, నుహిజ పాల్గొన్నారు.

**మరికొన్ని రోజుల్లో వానాకాలం రానుంది. ఈ నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత పాటించకపోయినట్లయితే విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా డెంగీ దోమల వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు. డెంగీలాంటి జ్వరాలు రాకుండా ఉండేందుకు వైద్యశాఖ సైతం ముందుగానే అప్రమత్తమైంది. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభించింది.**

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



# డెంగీతో జాగ్రత్త సుమా..!

**అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ**

**అవగాహన కార్యక్రమాలు ప్రారంభం**

**నీరు నిలువ ఉంచుకోవద్దని సూచనలు**

**జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరికలు**

ఈడిస్ ఈజిప్టై అనే దోమ కుట్టడం ద్వారా డెంగీ వ్యాపిస్తుంది. ఈ దోమ పగటిపూట ఎక్కువగా కుడుతుందని వైద్యులు తెలిపారు. సాధారణంగా నిల్వఉన్న నీటిలో ఈ దోమలు గుడ్లు పెడతాయి. అందువల్ల ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కూలర్లు, పూలకుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, పాత డబ్బాలు, పగిలిన కుండల్లో నీటిని వారానికొకసారి పూర్తిగా తొలగించి శుభ్రం చేయాలి. మంచినీటి తొట్టెలు, డ్రమ్ములపై మూతలు తప్పనిసరిగా ఉంచాలి. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయాలి. ఇంటి చుట్టూ ఉన్న మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలి.

### జ్వరం.. ఒళ్లు నొప్పులుంటే..

జ్వరం, తీవ్ర తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, ఒళ్లు నొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలి. సొంత వైద్యం చేసుకోవడం, నిర్లక్ష్యం చేయడం వల్ల ప్లేట్‌లెట్లు పడిపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు.

### నిండుగా ఉండే దుస్తులు ధరించాలి..

దోమలు కుట్టకుండా పూర్తిగా నిండుగా ఉండే దుస్తులు ధరించాల్సి ఉంటుంది. పగటిపూట కూడా దోమతెరలు వాడాలి. కిటికీలకు మెష్‌లు బిగించుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు ఇంట్లో ఎలాంటి అనారోగ్యంతో ఉన్నా వారి వివరాలు తెలియజేయాలి. వారు చెప్పే సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

### డెంగీ నివారణ ప్రజలందరి బాధ్యత..

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగీ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డెంగీ నివారణ అనేది ప్రజలందరి బాధ్యత. వైద్యారోగ్య శాఖ నుంచి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాం. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. నీళ్లను నిలువ ఉంచుకోవద్దని.. ఇంటి చుట్టూ అపరిశుభ్రమైన వాతావరణం ఉంచుకోవద్దని పేర్కొంటున్నారు. పరిసరాలను పరిశుభ్రతతోనే డెంగీని నివారించవచ్చని సూచిస్తున్నాం.

– డాక్టర్ రవీందర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

**జిల్లాలో డెంగీ కేసులు..**

| నెల | 2024 | 2 025 |
|---|---|---|
| జనవరి | 4 | 1 |
| ఫిబ్రవరి | 1 | 0 |
| మార్చి | 0 | 2 |
| ఏప్రిల్ | 1 | 1 |
| మే | 1 | 2 |
| జూన్ | 3 | 11 |
| జూలై | 22 | 26 |
| ఆగస్ట్ | 104 | 38 |
| సెప్టెంబర్ | 35 | 26 |
| అక్టోబర్ | 9 | 2 |
| నవంబర్ | 0 | 2 |
| డిసెంబర్ | 0 | 0 |

## బాధితుడికి ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, భీమ్‌గల్:** తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న భీమ్‌గల్ మండల కేంద్రానికి చెందిన తీట్ల అంకిత్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 2.50లక్షల ఎల్ఓసీ మంజూరైంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తీట్ల జనార్దన్ కుమారుడైన అంకిత్ కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా, పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. వైద్య ఖర్చులు భారీగా ఉండడంతో, ఆర్థిక సహాయం కోసం బాధితుడి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ను ఆశ్రయించారు. బాధితుడి పరిస్థితిపై సానుకూలంగా స్పందించిన సునీల్ కుమార్.. తక్షణమే ప్రభుత్వం నుంచి రూ. 2.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందజేశారు. దీంతో బాధితులు సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉత్తర శబరిమలలో కేరళ మాత స్వాముల ప్రత్యేక పూజలు





**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలోని ఉత్తర శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయాన్ని ఆదివారం కేరళ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన 118 మంది మాత స్వాములు దర్శించుకున్నారు. జగద్గురు ఆదిశంకరాచార్య కాలాడి మఠం క్షేత్రాచార్యులు బ్రహ్మశ్రీ ఉన్నికృష్ణన్ నంబూద్రి ఆధ్వర్యంలో తరలివచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని పూజించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేరళలోని శబరిమలలో మహిళలకు ప్రవేశం లేనప్పటికీ ఇక్కడి ఉత్తర శబరిమల ఆలయంలో మహిళలకు సైతం స్వామివారిని దర్శించుకునే వీలు కల్పించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ క్షేత్రాన్ని సందర్శించుకోవడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలోని ఉత్తర శబరిమల ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు సంగన్న గారి రవీందర్ గౌడ్ కేరళ నుంచి వచ్చిన మాత స్వాములకు ఉత్తర శబరిమల ఆలయ మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొల్లు శ్రీకాంత్, చంద్రమౌళి, రాజాగౌడ్ మహతి, రాజిరెడ్డి, సతీష్, వంశీ, శ్రీరామ్, దత్తు, రజనీకాంత్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఆదివారం రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన.. అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. రైతులకు సాగునీటి అవసరాలు తీర్చడంలో సిద్ధాపూర్ రిజర్వాయర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పనుల్లో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే వర్ని మండలంతో పాటు పరిసర గ్రామాల రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కాంగ్రెస్ మండలాధ్యక్షుల నియామకం

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని బోధన్, బాల్కొండ నియోజకవర్గాలకు సంబంధించి నూతన మండల అధ్యక్షుల నియామకాలు చేపట్టినట్లు డీసీసీ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. బోధన్ నియోజకవర్గంలోని బోధన్ మండలానికి నాగేశ్వర రావు, రెంజల్‌కు మోబీన్ ఖాన్, ఎడపల్లికి పులి శ్రీనివాస్, సాలూరాకు బుచ్చల్వర్ రవి, నవీపేట్‌కు శ్రీనివాస్ గౌడ్, బోధన్ టౌన్‌కు అంకు దామోదర్‌లను ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచనల మేరకు నియమించారు. అలాగే బాల్కొండ నియోజకవర్గంలో కమ్మర్‌పల్లి మండలానికి బోనగిరి భాస్కర్, బాల్కొండకు సాట్ల ప్రవీణ్, ముప్కాల్‌కు శ్రీకాంత్ రెడ్డి, మెండోరాకు బడల సాయిరెడ్డి, ఎర్గట్లకు శివనోళ్ల శివ కుమార్, వేల్పూర్‌కు రంగు అనిల్ గౌడ్, మోర్తాడ్‌కు బక్కూరి ఆనంద్, భీమ్‌గల్‌కు మల్యాల లక్ష్మణ్‌లను బాల్కొండ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డి సూచనల మేరకు పీసీసీ చీఫ్ నియమించారు. ఈ మేరకు వారిని నియమిస్తూ కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. నూతనంగా నియమించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు వారికి ఇచ్చిన బాధ్యతలను విధిగా నిర్వహించాలని, పార్టీని క్షేత్ర బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు.

## ఆలూర్‌లో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం..

**అక్షరటుడే, ఆర్మూర్:** మండల కేంద్రంలోని 12వ వార్డులో కొన్ని రోజులుగా నెలకొన్న లోవోల్టేజీ సమస్యకు విద్యుత్ శాఖ అధికారులు పరిష్కారం చూపారు. కాలనీలో విద్యుత్ సరఫరా సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికులు సమస్యను ఏడీ కృష్ణ, ఏఈ శ్రావణ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి పనులు ప్రారంభించారు. దీంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్న అధికారులు లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, లైన్‌మన్ గంగాధర్, నరేష్, ప్రవీణ్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైస్ మల్లారెడ్డి, వార్డ్ మెంబెర్స్ అమందు సంజీవ్, ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ భీమ్‌గల్ మండల అధ్యక్షుడిగా మల్లెల లక్ష్మణ్

**అక్షరటుడే, భీమ్‌గల్:** కాంగ్రెస్ భీమ్‌గల్ మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు మల్లెల లక్ష్మణ్ నియమితులయ్యారు. జిల్లావ్యాప్తంగా పలు మండల, పట్టణ కమిటీల అధ్యక్షులను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి నాగేష్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా భీమ్‌గల్ మండల అధ్యక్షుడిగా మల్లెల లక్ష్మణ్‌ను, పట్టణ అధ్యక్షుడిగా పర్స అనంత్ రావును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా నాయకత్వానికి, సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ధ్యేయంగా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఇసుక లారీని సీజ్ చేసిన చీతాఫోర్స్



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జిల్లాలో చీతాఫోర్స్ చురుకుగా పనిచేస్తోంది. ఇసుక అక్రమ రవాణాపై గట్టి నిఘా వేసింది. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తూ చీతాఫోర్స్ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఈ క్రమంలో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ ఇన్‌ఛార్జి మస్తాన్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది వేల్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక భారీ లారీని పట్టుకున్నారు. పట్టుబడిన లారీని తదుపరి చట్టపరమైన చర్యల కోసం సంబంధిత వేల్పూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.